నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 నిజామాబాద్, బుధవారం 9 ఏప్రిల్ 2025 NIZAMABAD




- ఇన్‌చార్జి మంత్రి ఇలాకాలో అక్రమ దందా
- ఆల్ప్రాజోలం వంటి వాటితో కల్లు తయారీ
- విచ్చలవిడిగా మత్తు పదార్థాల వాడకం
- ఉమ్మడి జిల్లాలో బరితెగించిన అక్రమార్కులు
- జనం ప్రాణాల మీదికొచ్చినా పట్టించుకోని మంత్రి

నిజామాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఉమ్మడి జిల్లాలో కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్నది. కొందరి ధన దాహం అమాయకుల ప్రాణాల మీదకు తెస్తున్నది. మోతాదుకు మించి రసాయనాలు, మత్తు పదార్థాలు కలిపి తయారు చేస్తున్న కల్లు ప్రజలను పరేషాన్ చేస్తున్నది. కల్తీ కల్లు మాఫియాను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ 'ముడుపుల' మత్తులో నిద్దరోతున్నదన్న ఆరోపణలున్నాయి. అధికారులు సక్రమంగా పని చేస్తే బాన్సువాడ డివిజన్‌లో కల్తీ కల్లు ఉదంతం వెలుగు చూసేదే కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మాఫియా ధన దాహంతో పాటు ఆబ్కారీ శాఖ కూడా నిర్లక్ష్యం మూలంగా 60 మందికి పైగా అస్వస్థతకు గురై దవాఖానల్లో చేరాల్సి వచ్చింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్ శాఖ.. అక్రమార్కులకే అండగా నిలవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాన్సువాడ తరహా కల్తీ కల్లు ఘటనలు జరిగితే నాలుగైదు రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మర్చిపోవడం అధికారులకు 'మామూలై' పోయింది.

# ప్రాణాలు పోతున్నా పట్టదా?

కల్లు మాఫియాకే ఆబ్కారీ మద్దతు


దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

ఇన్‌చార్జి మంత్రి ఇలాకాలోనే..

ఆబ్కారీ శాఖ అమాత్యుడు జూపల్లి కృష్ణారావు ఇన్‌చార్జీగా ఉన్న ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖ అదుపు తప్పింది. యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసింది. తనిఖీల్లేవు. ఆల్ప్రాజోలం రవాణాపై నిఘా లేదు. అక్రమంగా సాగుతున్న మద్యం విక్రయాలపై అదుపు లేకుండా పోయింది. అయినప్పటికీ ఆ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు కనీసం దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖలో పూర్తి స్థాయి సిబ్బంది ఉన్నారు. వీరంతా ఎప్పటికప్పుడు కల్లు కాంపౌండ్‌లను తనిఖీ చేసి కల్తీని నియంత్రించాలి. కానీ క్షేత్ర స్థాయిలో తనిఖీలే లేవు. మామూళ్లు ఎరగా వేస్తున్న కల్లు మాఫియా.. ఇష్టానుసారంగా కల్లు తయారు చేసి జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. అధికార పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోతున్నారు. వాస్తవానికి ఎక్సైజ్ అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తే కల్తీ కల్లు బారిన పడి ప్రజలు విలవిల్లాడాల్సిన దుస్థితి తలెత్తేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇన్‌చార్జి మంత్రి ఇకనైనా ఉమ్మడి జిల్లాను పట్టించుకుని, అదుపు తప్పిన ఆబ్కారీ శాఖను సరైన దారిలో పెట్టాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

## విషమంగానే ఇద్దరి పరిస్థితి

### -64కు చేరిన కల్తీ కల్లు బాధితుల సంఖ్య

బాన్సువాడ, ఏప్రిల్ 8: బాన్సువాడ డివిజన్‌లో కలకలం రేపిన కల్తీ కల్లు ఉదంతంలో బాధితుల సంఖ్య 64కి చేరింది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి, అంకోల్, అంకోల్ తండాతో పాటు బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామాల్లో కల్తీ కల్లు కారణంగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు బాన్సువాడ దవాఖానకు అంబులెన్సులు క్యూ కట్టాయి. బాధితులను బాన్సువాడ, నిజామాబాద్, కామారెడ్డి దవాఖానల్లో చేర్పించారు. నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాన్సువాడలో ఉన్న బాధితులు కోలుకుంటున్నారని దవాఖాన సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు.

## బాధితులకు పోచారం పరామర్శ

బాన్సువాడ, ఏప్రిల్ 8:ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ కల్లు తయారీదారులు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఎక్సైజ్ అధికారులకు సూచించారు. బాన్సువాడ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి పోచారం మంగళవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కల్తీ కల్లు తయారీలో ఎవరున్నా వదిలి పెట్టొద్దని అధికారులకు సూచించామన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదని హెచ్చరించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ విజయలక్ష్మికి సూచించారు.

## కల్లు తాగితే ఇట్లయ్యింది..

బాన్సువాడ, ఏప్రిల్ 8 : రోజు తాగినట్లు కల్లు దుకాణానికి పోయి కల్లు తాగిన. తాగినంక పాణం పోయినట్లయ్యింది. కండ్లు తిరుగుకుంటా నరాలు పట్టినయి. మెడలు వంకర్లు పడితే పిల్లలు పరేషాన్ అయ్యిండ్రు. పైసలు పెట్టి పాణం మీదకు తెచ్చుకున్నట్లయ్యింది. కల్తీ కల్లు మందు వేరేది కలిపి మా ప్రాణాలు తీస్తుండేనేమో. కల్లు తయారీలో ఏం చేసిండ్రో అర్థం కాలేదు. ప్రాణాలు తీసే కల్లును దుకాణాల వాళ్లను అమ్మకుంట చేయాలే .



-కె. సాయిలు, దుర్కి

## కల్తీ కల్లు అని మాకు తెల్వది..

రోజూ పనిచేసి వచ్చి ఒకసీసా కల్లు తాగి , బుక్కెడు తిని పండుకుంటం. కానీ గిసుంటి కల్లు అమ్మి మా ప్రాణాలు తీస్తుండే. కల్తీ కల్లు తయారు చేపిచ్చిన ముస్తేదారులను పట్టుకోవాలె. ఒక్కలా ఇద్దరా యాభై అరవై మంది అంబులెన్సులో వచ్చింద్రు.. దవాఖానలో మంది పట్టలే. డాక్టర్లు పట్టించుకోవట్లే మేము బయటపడినం. కల్తీ కల్లు అమ్మి పరేషాన్ చేస్తే , సార్లు పట్టుకోరా. అది కల్తీ కల్లు అని మాకు తెల్వదు.



-ఆర్ పోచయ్య, దామరంచ

## 23 మంది అరెస్టు..
# 18 లైసెన్సులు రద్దు

ఒక కల్లు డిపో సీజ్

బాన్సువాడ, ఏప్రిల్ 8: కల్తీ కల్లు ఉదంతం నేపథ్యంలో 23 మందిని అదుపులోకి తీసుకున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషన్ సోమిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన బాన్సువాడ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ కల్లు తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుర్కిలో 9మంది, అంకోల్‌లో ఏడుగురు, దామరంచలో ఇద్దరిని కలిపి మొత్తం 18 మంది ఎఫ్‌టీఎల్ లైసెన్సులు రద్దు చేశామని చెప్పారు. దుర్కిలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న కల్లు డిపోను సీజ్ చేసినట్లు వివరించారు. కల్తీ కల్లు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపేందుకు కామారెడ్డి సూపరింటెండెంట్ హన్మంత్‌రావును నియమించామన్నారు. శాంపిల్స్‌ను హైదరాబాద్ లోని ల్యాబ్‌కు పంపించామన్నారు.


## స్వచ్ఛమైన కల్లు ఏది?

ఆబ్కారీ శాఖ అనుమతితో వెలిసిన కల్లు బట్టీల్లో స్వచ్ఛమైన చెట్ల కల్లు అందుబాటులో ఉండాలి. ఈత, తాటి చెట్ల నుంచి తీసిన కల్లు మాత్రమే విక్రయించాలి. కానీ అందుకు విరుద్ధంగా కల్లు కాంపౌండ్‌లలో రసాయనాలతో చేసిన కల్లునే సీసాల్లో నింపి అమ్ముతున్నారు. బహిరంగంగానే వేలాది లీటర్లలో ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాన్ని కలిపి కృత్రిమ కల్లును సృష్టిస్తున్నారు. ఇదీ అచ్చంగా కల్లు మాదిరిగానే కనిపిస్తుంది. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేదలు, రోజువారీ కూలీలు ఈ కల్లు వైపే మొగ్గు చూపుతున్నారు. దీనికి అలవాటు పడిన వారు స్వచ్ఛమైన కల్లు తాగడానికి ఇష్టపడరు. ఆల్ప్రాజోలం ప్రభావం మూలంగా నరాల బలహీనతకు గురవుతాయి. తద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొంతకాలం తర్వాత మంచానికే పరిమితమయ్యే ప్రమాదం ఉంటుంది. ఆల్ప్రాజోలంతో కల్లు తయారు చేస్తూ మాఫియా రూ.కోట్లకు పడగలెత్తుతున్నది. రాజకీయ పార్టీల్లో ప్రాబల్యం పెంచుకుంటూ, అధికారులను మచ్చిక చేసుకుని తమ దందాకు అడ్డు లేకుండా చూసుకుంటున్నది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో క్లోరో హైడ్రేట్, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి ప్రమాదకరమైన రసాయనాలు వినియోగిస్తూ కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్నది

# పోలీసుల జులుం

- డయల్ 100కు ఎందుకు ఫిర్యాదు చేశావంటూ స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదిన ఖాకీలు
- దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితుడు

ఇందల్వాయి, ఏప్రిల్ 8 : ఆపద సమయంలో లేదా ఇంకేమైనా ప్రమాదం జరిగితే వెంటనే సాయం కోసం డయల్ 100 నంబర్‌కు కాల్‌చేస్తే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారు లేదా బాధితులకు అండగా ఉంటారు. కానీ ఇందల్వాయి పోలీసులు మాత్రం ఫిర్యాదుదారుడిపై తమ ప్రతాపం చూపెట్టారు. స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. బాధితుడి కథనం ప్రకారం.. ఇందల్వాయికి చెందిన శ్రీనివాస్ అలియాస్ సాయి మండల కేంద్రంలో పెయింట్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి తన దుకాణం ఎదుట మద్యం తాగిన ఓ వ్యక్తి బైక్ అడ్డుగా పెట్టడంతో గొడవ చోటుచేసుకున్నది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి సాయిలును దూషించాడు. దీంతో సాయిలు డయల్ 100 నంబర్‌కు కాల్ చేశాడు. ఎంతసేపైనా పోలీసులు రాకపోవడంతో తిరిగి మరోసారి కాల్ చేశాడు. కొద్దిసేపటికి అక్కడి చేరుకున్న పోలీసులు మద్యం మత్తులో గొడవ చేసిన వ్యక్తిని వదిలి, ఫిర్యాదు చేసిన సాయిలుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మద్యం తాగిన వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్ పెట్టాలని కోరగా.. తమకే ఎదురు చెబుతావా, 100 డయల్‌కు ఎందుకు ఫిర్యాదు చేశావని, నీకు పనీపాట లేదా అంటూ దురుసుగా వ్యవహరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ రావాలని చెప్పగా.. సాయిలు తన సోదరుడితో కలిసి వెళ్లాడు. స్టేషన్‌లో తనపై విచక్షణారహితంగా ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు దాడి చేశారని సాయిలు వాపోయాడు. తనతో వచ్చిన తమ్ముడు మోహన్‌పై సైతం దాడి చేశారని తెలిపాడు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన సాయిలు ప్రభు త్వ దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఎస్సైతోపాటు కానిస్టేబుళ్లపై సీపీతోపాటు మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.


దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితుడు సాయిలు

### దురుసుగా ప్రవర్తించడంవల్లే కేసు నమోదు

అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మోహన్, తిర్మన్‌పల్లికి చెందిన శంకర్ ఇద్దరు గొడవ పడుతున్నారని ఫిర్యాదు రావడంతో మా కానిస్టేబుళ్లు అక్కడకి వెళ్లారు. విచారణ సమయంలో కానిస్టేబుళ్లపై సాయిలు అతని సోదరుడు దాడికి ప్రయత్నించి, దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు ఎవరిపై దాడి చేయలేదు. విధులకు ఆటంకం కలిగించడంతోనే వారిపై కేసు నమోదు చేశాం.


-ఎస్సై మనోజ్ కుమార్

# 'డబుల్ ఇండ్ల' స్వాధీనం

- తాళాలు వేసుకున్న పేదలు
- అడ్డుకున్న అధికారులు


ధర్పల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటికి తాళం వేస్తున్న మహిళ

ధర్పల్లి, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను స్థానిక నిరుపేదలు మంగళవారం ఆక్రమించుకున్నారు. ఇండ్లకు తాళాలు వేసుకోగా..విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకొని, వారిని సముదాయించి ఖాళీ చేయించారు. మండల కేంద్రంలోని భీమ్‌గల్ రోడ్డులో బీఆర్ఎస్ హయాంలో 48 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారితోపాటు నిరుపేదలు మంగళవారం డబుల్ బెడ్ రూం ఇండ్లను స్వాధీనం చేసుకున్నారు. తాళాలు ఉండగా వాటిని పగుల గొట్టి ఆక్రమించుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మాలతి అక్కడికి చేరుకొని పోలీసులను పిలిపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇండ్లు 48 ఉన్నాయని, లబ్ధిదారులు వేలల్లో ఉన్నారని తెలిపారు. ఇంకా కిటికీలు, సంపు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదని చెప్పారు. ఇండ్లను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడం నేరమవుతుందని నచ్చజెప్పారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేసి డ్రా పద్ధతిన అందజేస్తామని తెలిపారు. ఇదివరకే పలుమార్లు దరఖాస్తులు ఇచ్చామని అయినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ చేతుల్లో ఏమీలేదని అధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకుంటే అర్హులకు అందేలా చూస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. డీటీ ప్రవీణ్, ఎస్సై రామకృష్ణ , నాయకులు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, చెలిమెల శ్రీనివాస్ ఉన్నారు.



## ఆహ్వానం

ఉమ్మడి నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు-కామారెడ్డి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభ దంపతుల కూతురు వివాహం ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నారు. ఈ వేడుకకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

-నిజాంసాగర్, ఏప్రిల్ 8

# రేపు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ, ఏప్రిల్ 8 : బాన్సువాడకు ఈ నెల 10న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ , బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్ మంగళవారం ఒక ప్రకటనలో తె లి పారు. పట్టణంలోని ఎస్ఎంబీ గార్డెన్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించనున్న సన్నాహక సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రజతోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. సన్నాహక సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

## భూపతిరెడ్డికి
# నిరసన సెగ

- రేషన్ కార్డులు, పింఛన్ల సంగతేమైందని నిలదీత
- ఎమ్మెల్యే స్వగ్రామంలో నీటి సమస్యపై ప్రశ్నించిన మహిళలు

సారంగాపూర్, ఏప్రిల్ 8: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మంగళవారం భంగపాటు ఎదురైంది. మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే స్వగ్రామంలోనే తాగునీటి సమస్యపై నిలదీశారు. నిజామాబాద్ మండలంలోని గుండారం, మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్, జలాల్‌పూర్, పాల్దా, తిర్మన్‌పల్లి, కొండూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు భూపతిరెడ్డి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గుండారం, జలాల్‌పూర్‌లో వేదిక వద్దకు దూసుకొచ్చిన మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయింది. కొత్త రేషన్ కార్డులు ఇయ్యలే. కొత్త పింఛన్లు ఇయ్యలే. ఇంకెప్పుడు ఇస్తారని' ప్రశ్నించారు. రెండు నెలలు ఓపిక పట్టండి, అర్హులందరికీ కార్డులు ఇప్పిస్తామని భూపతిరెడ్డి సర్దిచెప్పారు. మరోవైపు, స్వగ్రామమైన జలాల్‌పూర్‌లో తాగునీటి సమస్యపై మహిళలు ప్రశ్నించారు. నీటి సరఫరా లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అక్కడున్న అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.


వేదిక వద్దకు వచ్చి ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళలు

## 'తరుగు'పై
# రైతన్నల ఆగ్రహం

- కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా
- భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పులలో ఆందోళన


కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కోటగిరి/ భీమ్‌గల్, ఏప్రిల్ 8: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో తరుగు తీయంపై రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కోటగిరిలో తహసీల్ ఆఫీస్ ఎదుట బైఠాయించగా.. భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పులలో ఆందోళన నిర్వహించారు. కోటగిరిలోని కొనుగోలు కేంద్రంలో తమకు ఎలాంటి సమాచారం లేకుండానే 40 కిలోల బస్తాకు 41 కిలోల 500 గ్రాముల నుంచి 650 గ్రాముల వరకు అదనంగా కాంటా వేస్తూ, క్వింటాలుకు రెండు కిలోలకు పైగా తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. రైతుల శ్రమను దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తంచేస్తూ తహసీల్ ఆఫీస్ ఎదుట ఏముల నవీన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తహసీల్దార్ సమక్షంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్ ఆఫీస్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాకల సాయిలు, కర్నె గజేందర్, వెల్లుట్ల గజేందర్, మామిడి శ్రీనివాస్, సాయిప్రసాద్, ఎడ్డెడి పోశెట్టి, కాశీరామ్, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కడ్తా పేరిట దోచుకుంటున్నారు..

కడ్తా పేరుతో దోచుకుంటున్నారని ఆరోపిస్తూ భీమ్‌గల్ మండలంలోని గోన్‌గొప్పుల లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు. కడ్తా పేరుతో బస్తాకు 41.800 కిలోల చొప్పున కాంటా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వాస్తవానికి బస్తాకు 41.500 కిలోల వడ్లు మాత్రమే కాంటా వేయాలని, కానీ 300 గ్రాముల వడ్లను ప్రతి బస్తాకు అదనంగా తూకం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో రైతు ప్రతి క్వింటాలుకు 600 గ్రాముల ధాన్యాన్ని అదనంగా నష్టపోతున్నాడని పేర్కొన్నారు. కేంద్రం నిర్వాహకుల తీరుతో తాము నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ షబ్బీర్, ఎస్సై మహేశ్ కొనుగోలు కేంద్రానికి చేరుకొని, రైతులను సముదాయించి, ఆందోళన విరమింపజేశారు. ఇకపై రైతులు కోరిన విధంగా బస్తాకు 41,500 కిలోలు వచ్చేలా కాంటా వేయిస్తామని భరోసా ఇచ్చారు.

### రెండున్నర కిలోల తరుగు తీస్తున్నరు..



వానకాలంలో 40 బస్తాలకు 41కిలోలు తరుగు తీశారు. ఇందులో 650 గ్రాములు సంచి తూకం కింద తీసేసినా ఇబ్బంది లేకుండే. కానీ ఇప్పుడు దారుణంగా కిలోన్నర నుంచి రెండున్నర కిలోల వరకు తరుగు తీస్తున్నరు. క్వింటాలు చొప్పున లెక్కిస్తే రైతులకు నష్టం వాటిల్లుతుంది.

- గజేందర్, రైతు, కోటగిరి

### భారీగా నష్ట పోతున్నాం..

వానకాలంలో కిలోనే తరుగు తీశా రు. ఇప్పుడు పెద్ద మొత్తంలో తరుగు తీయడం మంచిది కాదు. రెండు కిలోల దాకా బస్తాకు తీస్తే, రైతుకు ఏం లాభం జరుగుతుంది. ప్రభుత్వం తరుగు దోపిడీని నివారించాలి.



- సాయిలు, రైతు, కోటగిరి